క్లుప్తంగా

మాజీ సీఎం జగన్ పర్యటన విజయవంతానికి పిలుపు

అల్లిపురం: నర్సీపట్నం పర్యటనలో భాగంగా గురువారం నగరానికి విచ్చేస్తున్న వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలికేందుకు లీగల్ సెల్ న్యాయవాదులు ఉదయం 9 గంటలకు ఎయిర్‌పోర్టుకు తరలి రావాలని రాష్ట్ర అధికార ప్రతినిధి పోకా సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి ఒడ శ్రీను పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరు బ్లేజర్లు వేసుకుని రావాలని ఆయన కోరారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



అనాథ మృతదేహాన్ని తరలిస్తున్న గోవిందరాజు, పోలీసులు

కంచరపాలెం: అవర్ హ్యాండ్స్ సేవా సమితి ప్రతినిధి పిల్లి గోవిందరాజు ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద అనాథ మృతదేహం ఉన్నట్లు పోలీసుల ద్వారా తెలుసుకుని సొంత ఖర్చులతో పోలీసుల సమక్షంలో అంత్యక్రియలు చేశారు. సమాజానికి మంచి సందేశం అందించే ఉద్దేశ్యంతో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు పిల్లి గోవిందరాజు తెలిపారు.

ఘనంగా అన్నసమారాధన



అన్నప్రసాదం వడ్డిస్తున్న గరికిన రవి తదితరులు

అల్లిపురం: కొబ్బరితోట శ్రీ విఘ్నేశ్వర న్యూ యంగ్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో దుర్గాదేవి శరన్నవ రాత్రులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమంలో మత్స్యకార నాయకులు గరికిన రవి, నీలం రాజు పాల్గొన్నారు. ఈ మేరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కొబ్బరితోట, ఎస్‌వీపీ నగర్, నేతాజీనగర్ ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

ఎన్జీజీవోస్ కాలనీలో అన్నదానం



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న నిర్వాహకులు

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీలో శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా హిందూ ముస్లిం క్రిస్టియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక నాయకుడు పోతు సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కులమతాలకు అతీతంగా నిర్వహించిన కార్యక్రమంలో చిన్నారు ముస్లిం యువత, హిందూ, క్రిస్టియన్ యువత పాల్గొని మత సామరస్యాన్ని చాటారు.

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన



ప్రసాద్‌గార్డెన్స్ అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న నిపుణులు

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం తల్లులు, గర్భిణులకు రొమ్ము, గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. వ్యాధి నిర్ధారణ అయిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి మహిళలకు తెలిపారు. క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవాలని, పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, పీహెచ్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాతృ స్పర్శ

- చిన్నారులను అమ్మలా సాకుతున్న అంగన్‌వాడీ కేంద్రాలు
- అల్లిపురం, కుమ్మరివీధి, కొబ్బరితోట, నేరెళ్లకోనేరు, చలువతోట కేంద్రాల్లో చక్కటి సేవలు
- ఆటపాటలతో అక్షరాభ్యాసం
- చురుగ్గా పోషణ్ భారత్ 2025 కార్యక్రమాలు



పోషకాహారం తయారీ సరుకులు



తల్లులు, బాలింతలతో ఆరోగ్య సూత్రాలపై ప్రమాణం చేయిస్తున్న ఆరోగ్య కార్యకర్త

అల్లిపురం: చిన్నపిల్లల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం 8వ రాష్ట్రీయ పోషణ్ భారత్ 2025 నిర్వహిస్తోంది. గత సెప్టెంబర్ 17వ తేదీ నుంచి అక్టోబర్ 16వ తేదీ వరకు పలు కార్యక్రమాలకు రూపకల్పన చేసింది. దీంట్లో భాగంగా అల్లిపురం, కుమ్మరివీధి, కొబ్బరితోట, నేరెళ్లకోనేరు, చలువతోట అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లులు, బాలింతలు, గర్భిణులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఆరోగ్య భారత్ లక్ష్యంగా..

ఆరోగ్య భారత్ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పోషణ్ మాస్ 2025లో భాగంగా రెండు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లల్లో బరువు తగ్గడం, సమస్యలు తగ్గించడం, బరువు తక్కువ ఉన్న పిల్లలను ట్రాక్ చేసేందుకు ప్రాథమిక డేటా సేకరణ, పట్టణ మురికివాడల్లో కనీసం 80 శాతం కుటుంబాలకు నాణ్యమైన, పోషకాహారం అందేలా చూడటం, శిశువులు, చిన్నపిల్లల పోషకాహార పద్ధతులపై సంరక్షకులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం ద్వారా పిల్లల ఆరోగ్యమే లక్ష్యంగా మహిళా-శిశు సంక్షేమ శాఖ పని చేస్తోంది.



చిన్నారుల ఎత్తు, బరువు కొలుస్తున్న కార్యకర్త



ప్రదర్శనలో ఉంచిన పోషకాహారం

పోషణపై అవగాహన..



తల్లులు, బాలింతలకు చిన్నారుల ఆరోగ్యం, పోషణపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులో భాగంగా తండ్రులకు కూడా అవగాహన కల్పిస్తున్నాం. వార్డుల వారీగా పోషణ పక్వాడా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. తద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడలమే లక్ష్యంగా పని చేస్తున్నాం.

– కె.నీలిమ, ప్రాజెక్ట్ ఆఫీసర్, ఐసీడీఎస్



చిన్నారి ఎత్తు కొలుస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

మిషన్ పోషణ్ 2.0

మిషన్ పోషణ్ 2.0 పేరిట పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేపడుతున్నారు. దీంట్లో భాగంగా పోషకాహార పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నారు.

- పిల్లల్లో స్థూలకాయం నివారణ, చక్కెర, నూనె వినియోగం తగ్గించడం.
- బాల్య దశ సంరక్షణ, విద్య .
- పోషణకు ఆహారంతో బలమైన పునాది.
- శిశువులు, చిన్నపిల్లల ఆహారపు అలవాట్లు.
- చిన్నారుల పోషణలో పురుషుల భాగస్వామ్యం
- పర్యవేక్షణ, డిజిటలీకరణ

రోజువారీ కార్యక్రమాలు..

- గర్భిణి, ప్రసూతి తల్లులకు కౌన్సెలింగ్
- పోషకాహారంతో కూడిన ఆహార పదార్థాల వంటల పోటీలు
- పిల్లల ఎదుగుల స్క్రీనింగ్ టెస్టులు
- తండ్రుల ఆధ్వర్యంలో పోషకాహార వంటల పోటీలు
- కథలు, బొమ్మల ద్వారా వివరణ
- 0-3 సంవత్సరాల పిల్లల కోసం తల్లిదండ్రులకు అవగాహన
- తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన
- అనుబంధ ఆహారంపై అవగాహన
- ఆరోగ్యకర జీవనశైలిపై అవగాహన

ఆర్థిక అంశాలపై అవగాహన తప్పనిసరి

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. కళాశాల ఎకనామిక్స్ విభాగం, జీవీఎంసీ ట్యాక్స్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల పాల్గొని విద్యార్థులు ఆర్థిక అవగాహన కలిగి ఉండడం సమాజాభివృద్ధికి ఎంతో ముఖ్యమన్నారు. అసిస్టెంట్ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్లు కె.ఉమ, ఎం.శేష కుమారి జీఎస్టీ ప్రాముఖ్యత, వినియోగదారులుగా వారి బాధ్యతలు, సేవింగ్స్ ద్వారా ఆర్థిక భద్రత సాధించే విషయమై వివరించారు. కార్యక్రమం అనంతరం అవగాహన ర్యాలీ చేపట్టారు. విద్యార్థులు సేవింగ్స్ ప్రాధాన్యత గురించి ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎకనామిక్స్ విభాగం ఇన్‌చార్జ్ డాక్టర్ కేఎల్ శిరీష, డాక్టర్ కె.గీతాంజలి, బి.అరుణకుమారి, పీవీటీఎల్ కుమారి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ కౌన్సిల్ మెంబర్‌గా శ్రీరాములు



నియామకపత్రం అందజేస్తున్న డాక్టర్ వికాస్ పాండే

దాబాగార్డెన్స్: కన్స్యూమర్ రైట్స్ నేషనల్ స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్‌గా సుప్రీంకోర్టు అడ్వకేట్ డాక్టర్ ఆర్.శ్రీరాములు నియమితులయ్యారు. ఈ మేరకు నియామకపత్రాన్ని కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వికాస్ పాండే తన కార్యాలయంలో బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వికాస్‌పాండే మాట్లాడుతూ డాక్టర్ శ్రీరాములు సేవల ద్వారా వినియోగదారులకు న్యాయం జరుగుతుందని, కౌన్సిల్ మరింత శక్తివంతం అవుతుందని కౌన్సిల్ నమ్ముతుందన్నారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానని డాక్టర్ శ్రీరాములు తెలిపారు.

సెయింట్ జోసెఫ్‌లో రచయిత్రుల జాతీయ సదస్సు



జ్యోతి ప్రజ్వలనతో సదస్సును ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు



అతిథులు, అధ్యాపకులతో విద్యార్థినులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో భాషా విభాగాల ఆధ్వర్యంలో 'స్వాతంత్ర్యానంతర తెలుగు-హిందీ సాహిత్యంలో రచయిత్రుల సాహిత్య కృషి' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ అధ్యక్షతన బుధవారం జరిగింది. గాంధీ సెంటర్ అధ్యక్షులు, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వి.బాలమోహన్‌దాస్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో సదస్సును ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రచయిత్రుల కృషి అభినందనీయమన్నారు. గౌరవ అతిథులుగా హాజరైన ఏపీడబ్ల్యూజే అధ్యక్షుడు డాక్టర్ ఎస్. కృష్ణబాబు, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ డి.వి. సూర్యారావు రచయిత్రుల సాహితీ కృషి గురించి మాట్లాడారు. ఈ సందర్భంగా రైటర్స్-జర్నలిస్ట్స్ అసోసియేషన్ సౌజన్యంతో జరగనున్న రెండు రోజుల సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సదస్సు కన్వీనర్, కళాశాల కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.కె. జయలక్ష్మి రచించిన కథల సంపుటిని, సెమినార్ గ్రంథాన్ని అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ద్వితీయ భాషా విభాగాధ్యక్షులు డాక్టర్ జె.నిర్మల, డాక్టర్ ఎస్. దీప్తి, డాక్టర్ కోటేశ్వరరావు, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

బకాయిల వసూలు వేగవంతం కావాలి



మాట్లాడుతున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

జగదాంబ: జోన్-4 పరిధిలో పెండింగ్‌లో ఉన్న బకాయిలను త్వరితగతిన వసూలు చేయాలని జెడ్సీ ఎం. మల్లయ్యనాయుడు అన్నారు. బుధవారం ఆయన జోనల్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, సెక్రటరీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆస్తి, నీటి, ఖాళీ స్థలాల పన్నులు ఎక్కువగా ఉన్నాయన్నారు. వీటిపై సంబంధిత యజమానులకు వెంటనే నోటీసులు జారీ చేయాలన్నారు. దీర్ఘకాల బకాయిదారుల ఆస్తులు సీజ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌వోలు అప్పలరాజు, పడాల్, ఆర్‌ఐలు సీతారాం, వీరబాబు, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

వానప్రస్థ వృద్ధాశ్రమంలో ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సూర్యతేజ

మురళీనగర్: వయసు పెరిగే కొద్దీ వ్యక్తిగత ఆరోగ్య పరిరక్షణపై దృష్టి సారించాలని డాక్టర్ సూర్య తేజ సూచించారు. ఏజ్ కేర్ ఫౌండేషన్, ఆర్.బి.ఎల్.ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పట్టాభిరెడ్డితోటలోని వానప్రస్థ వృద్ధాశ్రమంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య సంరక్షణపై వృద్ధులకు అవగాహన కల్పించారు. వయసు పెరిగిన వారు తప్పనిసరిగా ఆహారపు అలవాట్లు మార్చుకోవాలన్నారు. తేలికగా జీర్ణమయ్యే ఆహారంతోపాటు పరిశుభ్రమైన నీటిని తీసుకోవాలని సూచించారు. కంటి పరీక్షలతోపాటు, బీపీ, సుగర్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. వానప్రస్థ వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న సభ్యులతో పాటు పట్టాభిరెడ్డితోట పరిసర ప్రాంతాల వృద్ధులకు ఉచితంగా పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వృద్ధాశ్రమం మేనేజింగ్ ట్రస్టీ రొబ్బి శ్రీనివాసరావు శిబిరం నిర్వహణకు సహకరించారు.

విశాఖ రైల్వేస్టేషన్‌లో అమృత్ సంవాద్



ఉత్తమ సూచన అందజేసిన ప్రయాణికురాలికి చిరు కానుక అందజేస్తున్న రైల్వే అధికారి పవన్‌కుమార్

తాటిచెట్లపాలెం: ప్రత్యేక క్యాంపెయిన్-5లో భాగంగా ప్రయాణికుల భాగస్వామ్యంతో కూడిన అమృత్ సంవాద్ కార్యక్రమాన్ని విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో బుధవారం నిర్వహించారు. జనరల్ స్లీపర్ క్లాస్ వెయిటింగ్ హాళ్ల వద్ద వాల్తేర్ డివిజన్ కమర్షియల్ మేనేజర్ కె. పవన్‌కుమార్ ప్రయాణికులతో ముచ్చటించారు. వారి సలహాలు, సూచనలు స్వీకరించారు. రైల్వే అధికారులు, ప్రయాణికుల ప్రత్యక్ష సమాచార ప్రక్రియలో భాగమే అమృత్‌సంవాద్. అక్టోబరు 31వ తేదీ వరకు జరిగే ఈ ప్రత్యేక క్యాంపెయిన్‌లో భాగంగా రైల్వే అధికారులు స్వయంగా ప్రయాణికుల నుండి పలు సూచనలు స్వీకరిస్తున్నారు. విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో బుధవారం జరిగిన అమృత్ సంవాద్ కార్యక్రమంలో భాగంగా ప్రయాణికులు కొన్ని సూచనలు చేశారు. ఎస్కలేటర్స్ దగ్గర కచ్చితంగా సహాయకులను నియమించాలని, వారు లేకపోవడంతో సీనియర్ సిటిజన్లు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అలాగే స్లీపర్ క్లాస్ కోచ్‌లలో రైల్వేనే భోజనం ఏర్పాటు చేయడం మంచిదని పలువురు తెలిపారు. వీరికి సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె. పవన్‌కుమార్ చిరు కానుకలు అందజేశారు.

జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ స్టడీ ఆన్ సోషల్ ఇంక్లూషన్ (సీఎస్ఎస్ఐ) ఆధ్వర్యంలో 2026 ఫిబ్రవరి 3,4 తేదీల్లో నిర్వహించనున్న రెండు రోజుల జాతీయ సదస్సు పోస్టర్‌ను వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ బుధవారం ఆవిష్కరించారు. ఏయూ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న ఆచార్యులు, పరిశోధకులు, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు, పంచుకోవడానికి ఈ సెమినార్ దోహదపడుతుందని వీసీ అన్నారు.

ప్రతి ఒక్కరికీ ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం కావాలి

దాబాగార్డెన్స్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండేందుకు ప్రాధాన్యతనివ్వాలని, అప్పుడే సమాజాన్ని అభివృద్ధి పథం వైపు నడిపించే అవకాశం ఉంటుందని ఆంధ్రా యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.ఉమామహేశ్వరరావు తెలిపారు. విశాఖపట్నం నార్త్ ఈస్ట్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నగరంలోని ఏవీఎన్ కళాశాలలో బుధవారం 'మానసిక ఆరోగ్యం, యువత.. పెద్దలు' అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఒత్తిడి నుంచి బయట పడుతూ ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి మనిషి ప్రయత్నించాలన్నారు. గ్రాఫిక్స్ ఐటీ సొల్యూషన్స్ డైరెక్టర్ జి.రాంబాబు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు శ్రీరామమూర్తి, ఎం.సురేష్‌కుమార్, అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాల లెక్చరర్ ఎం.సింహాద్రినాయుడు నూతన జీఎస్టీ విధానం అమలు తీరు, వ్యాపార వర్గాలు, ప్రజలకు కలిగే ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పి.కృష్ణకుమారి, అధ్యాపక బృందం పైడి రజని, సంతోష్, సబిత, మల్లిక్, లావణ్య, అనంతలక్ష్మి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి భరోసా

కంచరపాలెం: కంచరపాలెం పరిధి గాంధీనగర్‌లో దసరా పండగ రోజు ఈదురుగాలులకు విద్యుత్ వైర్లు తెగిపడిన ఘటనలో మృతి చెందిన టీ దుకాణదారుడు బత్తిన ఈశ్వరరావు (52) కుటుంబ సభ్యులు రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ ఈతల పాక సుజాత నేతృత్వంలో బుధవారం రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితను కలిశారు. కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించేందుకు చర్యలు చేపట్టమని కలెక్టర్‌కు హోంమంత్రి అనిత తెలిపారు. ప్రభుత్వం అన్ని విధాల ఆదుకునులా చర్యలు తీసుకుంటానని ఆమె భరోసా అందించారు. కార్యక్రమంలో జి.సౌజన్య, వీరుబాబు, కె.అప్పారావు, ఎం.సుధ, బి.శ్రీకాంత్, వెంకటరమణ, సీహెచ్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

వాల్తేర్ డివిజన్ నూతన ఏడీఆర్‌ఎంగా రామారావు



తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ నూతన అడిషనల్ డివిజనల్ రైల్వే మేనేజర్‌గా కుండు రామారావు నియమితులయ్యారు. శ్రీకాకుళం జిల్లా, పలాసకు చెందిన ఆయన 2002లో ఆంధ్రా యూనివర్సిటీలో బీటెక్ సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేసారు. ప్రజాసేవపై గల ఆసక్తితో 2006లో ఇండియన్ ఇంజినీరింగ్ సర్వీసెస్ పరీక్ష రాసి, ఆలిండియా 44వ ర్యాంకు సాధించి రైల్వేలో చేరారు. పలు జోన్లలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్‌గా, సీనియర్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్‌గా, సీనియర్ డివిజినల్ ఇంజినీర్‌గా, డిప్యూటీ చీఫ్ ఇంజినీర్‌గా పని చేశారు. జపాన్‌లో నిర్వహించిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో కూడా ఈయన పాల్గొన్నారు. తన సేవలకు గాను ప్రతిష్టాత్మక జనరల్ మేనేజర్ అవార్డును 2010లో పొందుకున్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై సదస్సు

మద్దిలపాలెం: ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై విద్యార్థులకు డాక్టర్ వి.ఎస్.కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం అవగాహన కల్పించారు. వృక్ష శాస్త్ర విభాగం, హరిత కృష్ణ ఎకో క్లబ్, ప్రజా ప్రగతి ట్రస్ట్, ఇండియా పొల్యూషన్ కంట్రోల్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన సదస్సుకు కళాశాల ప్రిన్సిపల్ ఐ.విజయబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ ఆవశ్యకతను తెలియజేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, కో ఆర్డినేటర్ కె.రవిబాబు, వృక్ష శాస్త్ర విభాగాధిపతి ఎస్.పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

వాసవీ భవన్‌లో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న దాతలు

దాబాగార్డెన్స్: ఆర్యవైశ్య యువజన సంఘం, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం పాతనగరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సమీపాన ఉన్న వాసవీ భవన్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆర్యవైశ్య యువజన సంఘం 53వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించినట్టు సంఘం అధ్యక్షుడు నేతి శ్రీనివాసరావు, కార్యదర్శి కట్టమూరి సూర్యనారాయణ తెలిపారు. ఆర్యవైశ్య యువజన సంఘం లక్ష్యాల్లో ఒకటైన సమాజ సేవలో భాగంగా ఈ రక్తదాన శిబిరం నిర్వహించి, సేకరించిన 40 యూనిట్ల రక్తాన్ని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి అందజేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధి ఎస్‌కేఎల్ రావు, ఆర్యవైశ్య యువజన సంఘం మాజీ అధ్యక్షుడు కేఎంవీఎస్‌టీ రామకృష్ణ, దుర్గా సోమేశ్వర రావు, శ్రీనివాసరావు, జగన్, సన్యాసి శెట్టి, సత్యనారాయణ, మధుబాబు, బాబూరావు, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంచం పట్టిన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు

- ఈ పాపం ప్రభుత్వానిదే
- ఏఐఎస్‌ఎఫ్ పార్వతీపురం జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్



కేజీహెచ్‌లో పిల్లల ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకుంటున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

దాబాగార్డెన్స్: పచ్చకామెర్లతో బాధపడుతూ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న పార్వతీపురం జిల్లా కురుపాం మండలం శివన్నపేట గురుకులం ఆశ్రమ పాఠశాల హాస్టల్‌కు చెందిన విద్యార్థులను పార్వతీపురం మన్యం జిల్లా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవికుమార్ బుధవారం పరామర్శించారు. పిల్లల ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన సాక్షితో మాట్లాడుతూ పచ్చకామెర్లతో బాధ పడుతున్న అనేక మంది విద్యార్థులను మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌లో చేర్పించారన్నారు. విద్యార్థులు అనారోగ్యంతో బాధ పడుతున్నా ప్రభుత్వంలో స్పందన లేదన్నారు. సుమారు 106 మంది విద్యార్థులు అనారోగ్యంతో మంచం పట్టారంటే అందుకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమన్నారు. మౌలిక వసతులు, మంచినీరు, వాష్‌రూమ్స్, బస చేసేందుకు సరిపడా గదులు, డైనింగ్ హాల్ సదుపాయం వంటివి ఏవీ లేనందున 10 రోజుల కిందట ఇద్దరు విద్యార్థులు మరణించారన్నారు. గిరిజన శాఖ మంత్రి సంధ్యారాణి మొదటి సంతకం ఏఎన్‌ఎం పోస్టుల భర్తీ ఫైల్‌పై పెడతానన్నారని, 16 నెలలైనా ఇప్పటి వరకు ఆ దిశగా చర్యలు చేపట్టలేదన్నారు. చనిపోయిన విద్యార్థులకు రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ అసిస్టెంట్లను నియమించాలన్నారు. విద్యార్థుల మరణానికి ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు.

గ్రీన్ కార్డ్‌కి ఈబీ-5 వీసా వేగవంతమైన మార్గం

ఇమ్మిగ్రేషన్ నిపుణులు



సమావేశంలో పాల్గొన్న సుబ్బరాజు పేరిచర్ల, ఫిష్కిన్, మల్హోత్రా

అల్లిపురం: ప్రస్తుతం వీసా నిబంధనల్లో ఉన్న గందరగోళం.. ఇతర వీసా కేటగిరీల్లో భారీ నిరీక్షణ.. ఈ పరిస్థితుల్లో ఈబీ-5 ప్రోగ్రామ్ అమెరికా గ్రీన్ కార్డ్ పొందడంలో అత్యంత వేగవంతమైన మార్గమని ఇమ్మిగ్రేషన్ అటార్నీ ఇల్యా ఫిష్కిన్ స్పష్టం చేశారు. న్యూయార్క్ ఇమ్మిగ్రేషన్ ఫండ్ ఆధ్వర్యంలో నగరంలోని ఓ హోటల్‌లో బుధవారం ఈబీ-5 ఇన్వెస్టర్ వీసా కార్యక్రమం జరిగింది. ఈబీ-5 లైవ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్, ఇండో అమెరికన్ చాంబర్ ఆఫ్ కామర్స్(ఐఏసీసీ) కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా ఇల్యా ఫిష్కిన్ మాట్లాడుతూ పెట్టుబడిదారులు తాము పెట్టుబడి పెట్టే రీజినల్ సెంటర్, ప్రాజెక్టులను జాగ్రత్తగా పరిశీలించాలని, ముఖ్యంగా సంస్థ చరిత్ర, న్యాయపరమైన కేసులు, పర్మనెంట్ గ్రీన్ కార్డుల ఆమోదం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకమైన 'అమెరికాలో పెట్టుబడి పెట్టండి- గ్రీన్ కార్డ్ పొందండి'పట్ల భారతీయులకు ఆసక్తి పెరిగిందని, దీని ద్వారా అర్హులైన భారతీయ పౌరులు, ఇతర విదేశీయులు పెట్టుబడి ద్వారా అమెరికాలో శాశ్వత నివాసం పొందవచ్చని తెలిపారు. ఈబీ-5 ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ ప్రతినిధులు సుబ్బారాజు పేరిచర్ల, సంపన్న్ మల్హోత్రా మాట్లాడుతూ..ఈ ప్రోగ్రామ్ ద్వారా పెట్టుబడి పెట్టి అర్హులైన వ్యక్తులు వారి కుటుంబాలతో సహా అమెరికాలో శాశ్వత నివాసం పొందే అవకాశం ఉందని తెలిపారు. ఐఏసీసీ, విశాఖపట్నం చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (వీసీసీఐ), ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్, ఎఫ్ఏపీసీసీఐ తదితర పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

జీవన నైపుణ్యాలతోనే ఉన్నత స్థానం



ధ్రువపత్రాలు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ కేవీ రమణ

మురళీనగర్ : పాలిటెక్నిక్ కెమికల్ డిప్లొమా విద్యార్థులు సబ్జెక్టులో పట్టు సాధించడంతోపాటు జీవన నైపుణ్యాలు పెంచుకోవడం ద్వారానే ఉన్నత స్థానానికి చేరుకోగలరని కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్) ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణ తెలిపారు. గైస్ కెమికల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉన్నత ఫౌండేషన్ నిర్వహించిన నైపుణ్య శిక్షణ ముగింపు సందర్భంగా బుధవారం ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సమాచార నైపుణ్యాలు, ఆంగ్ల భాషలో మాట్లాడడం, జీవన నైపుణ్యాలను పెంచుకోవడం వంటి అంశాల్లో శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులకు ధ్రువపత్రాలు అందించారు. కార్యక్రమంలో పెట్రో కెమికల్స్ హెడ్ సీహెచ్ జయప్రకాష్ రెడ్డి, సీనియర్ లెక్చరర్లు పాల్గొన్నారు.